నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 30 జనవరి 2024 | MAHABUBNAGAR NARAYANPET

## వేరుశనగ @ రూ.7,386




బాదేపల్లి మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన వేరుశనగ

జడ్చర్ల, జనవరి 29 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగకు ధర పెరిగింది. గత శుక్రవారం వరకు తగ్గుతూ వచ్చిన ధరలు మళ్లీ పెరగడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత శనివారం రూ.87 అధికం రాగా.. సోమవారం రూ.220 పెరిగాయి. కందులకు కూడా క్వింటాకు రూ.200 పెరిగింది. సోమవారం బాదేపల్లి మార్కెట్‌కు 5,283 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా.. గరిష్ఠంగా రూ.7,386, కనిష్ఠంగా రూ.4 వేలు, మధ్యస్తంగా రూ.6,886 ధర పలికింది. 142 క్వింటాళ్ల కందులు రాగా.. గరిష్ఠంగా రూ.9,845, కనిష్ఠంగా రూ.9,269.., 42 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ ధాన్యం రాగా.. గరిష్ఠంగా రూ.2,973., జొన్నకు గరిష్ఠంగా రూ.5,451, బెబ్బర్లు క్వింటాకు గరిష్ఠంగా రూ.6,777, మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,365 ధర వచ్చినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

# గులాబీ రెడీ

## పాలమూరు పార్లమెంట్ స్థానంపై గురి



- బీఆర్ఎస్ అధినేతతో సిట్టింగ్ ఎంపీ సమావేశం
- ఇప్పటికే హైదరాబాద్‌లో కేటీఆర్ సారథ్యంలో పార్లమెంట్ సెగ్మెంట్‌పై ముగిసిన సమీక్ష

- త్వరలో నియోజకవర్గస్థాయి సమావేశాలు
- అనుసరించాల్సిన ప్రణాళికలకు రూపకల్పన
- వ్యూహాలకు పదునుపెడుతున్న నాయకులు
- కాంగ్రెస్ మైనస్‌లను ప్లస్ చేసుకునేలా అడుగులు
- అన్ని సెగ్మెంట్లలో పార్టీ బలోపేతంపై దృష్టి
- స్థానిక సంస్థలు చేజారకుండా పక్కాగా వ్యూహం

మహబూబ్‌నగర్, జనవరి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికలు ముగియగా.. ఇక పార్లమెంట్ ఎన్నికల వంతు రానున్నది. త్వరలో ఎలక్షన్లు జరుగనుండడంతో రాజకీయ వేడి రగులుతున్నది. అన్ని పార్టీలు ఈ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే మూడుసార్లు విజయం సాధించిన గులాబీ దళం మరోసారి పాలమూరుపై జెండా ఎగురవేసేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడంతోపాటు అధికార పార్టీపై వస్తున్న వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నది.

***ముగిసిన సమీక్ష..***

ఇప్పటికే పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. కింది స్థాయి నుంచి పార్టీ బలోపేతంగా ఉందని, ఇదే స్ఫూర్తితో స్థానాన్ని కైవసం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌తో సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి సమావేశమయ్యారు. పార్టీ అభ్యర్థులపై చర్చ జరిగింది. ఈసారి కూడా పాలమూరు స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నించాలని ఎంపీని కోరారు. మరోవైపు పార్టీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించి పార్లమెంట్ ఎన్నికలకు గులాబీ సైన్యాన్ని సన్నద్ధం చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 50 రోజులు గడుస్తున్నా ఇంకా స్థానిక సంస్థలపై బీఆర్ఎస్ పట్టు కొనసాగుతోంది. ఒక్క మహబూబ్‌నగర్ కోస్గి మున్సిపాలిటీ మినహా మిగతా 17 మున్సిపాలిటీల్లో గులాబీ జెండా రెపరెపలాడుతుంది. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్థానిక సంస్థల ప్రతినిధులు పార్టీలోనే కొనసాగుతున్నారు. ఇదే వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు బలంగా మారుతుందని పార్టీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు

### హామీలన్నీ తుంగలో తొక్కిన కాంగ్రెస్..

అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు గుప్పించింది. అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి నెలన్నర అవుతున్నా ఒక్క ఫ్రీ బస్ తప్ప మిగతా హామీలేవీ నెరవేర్చలేదు. అన్నిటికీ 100 రోజుల డెడ్‌లైన్ అంటూ కాలయాపన చేస్తున్నది. యాసంగి సీజన్ దాటుతున్నా రైతులకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో రైతుబంధు పడలేదు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీపై ముఖ్యమంత్రి, మంత్రులు తలోతీరుగా మాట్లాడుతున్నారు.. కొత్త ఫీచర్ల ఊసే లేదు.. పాత పింఛన్ అందిస్తుండడంతో ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది. మరోవైపు రైతులకు కరెంట్ సంక్షేమం వెంటాడుతున్నది. ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నప్పటికీ ప్రకటించి రైతుల పంటలు ఎండిపోవడానికి ప్రభుత్వ పాలసీలు దోహదం చేస్తున్నాయి. ఒక్క వరికి తప్ప మిగతా ఏ ఒక్క పంటలకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదు. ఎరువులు, విత్తనాలు సకాలంలో అందక క్యూలో నిలబడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇవన్నీ బీఆర్ఎస్ అధికారంలో ఉంటే అయ్యేవి కావని సామాన్య ప్రజలు అంటున్నారు. ప్రజా వ్యతిరేకత వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బయటపడే అవకాశం ఉన్నదని దీన్ని బీఆర్ఎస్ పార్టీ సద్వినియోగం చేసుకోవాలని అధిష్టానం ఆదేశాలు ఇ చ్చింది. దీంతో కిందిస్థాయి క్యాడర్‌ను పార్లమెంట్ ఎన్నికల కోసం స న్నద్ధం చేస్తున్నది. అన్ని నియోజకవర్గాల్లో పట్టు జారకుండా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను ఒకతాటిపైకి తీసుకొస్తున్నారు. కార్యకర్తల మనోబలం దెబ్బతినకుండా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు విస్తృతంగా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ అధికార పా ర్టీని ప్రశ్నిస్తున్నారు. వంద రోజులు అయ్యాక హామీలు నెరవేర్చకపోతే భారీ ఆందోళనలు చేపట్టాలని బీఆర్ఎస్ వ్యూహాలు సిద్ధం చేస్తున్నది. ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సీటు విషయంలో బీజేపీలో చీలికలు రావడం అధికార కాంగ్రెస్ పార్టీలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వంటి అంశాలు కలిసి వస్తాయని గులాబీ పార్టీ భావిస్తున్నది. ఈసారి ఎలాగైనా సిట్టింగ్ స్థానం నిలబెట్టుకోవాలని పాలమూరుపై గులాబీ గురి పెట్టింది.

### చెక్కుచెదరని బీఆర్ఎస్ క్యాడర్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 స్థానాల్లో 12 స్థానాలు కాంగ్రెస్ గెలిచినప్పటికీ 85 శాతం ఉన్న స్థానిక కేడర్ ఇంకా గులాబీ పక్షానే ఉన్నది. అక్కడక్కడ అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్నా మొక్కవోని ధైర్యంతో కార్యకర్తలు గులాబీ జెండాకు అండగా నిలిచారు. అధికార పార్టీ స్థానిక నేతలను ప్రలోభాలకు గురిచేసి పార్టీని మార్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులను కొనుగోలు చేసే ప్రయత్నంలోనే ఉన్నారు. ఎక్కడ కూడా సఫలీకృతం కావడం లేదు. ఒక్క మహబూబ్‌నగర్, కోస్గి మున్సిపల్ స్థానాలు మాత్రమే చేజిక్కించుకున్నారు. మిగతా చోట్ల ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఇక జెడ్పీ చైర్మన్లను తొలగించాలనే ప్రయత్నం కూడా విఫలమవుతున్నది. ఆయా జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బే తగులుతున్నది. సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురి చేస్తున్నా ఎవరూ లొంగడం లేదు. స్థానిక సంస్థల క్యాడర్ కాంగ్రెస్ వైపు రాకపోవడంతో వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ప్రభావం పడుతుందని అధికార పార్టీలో గుబులు రేగుతున్నది.

### పార్లమెంట్‌పైగురి ..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్‌కు కంచుకోటగా మారింది. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో పార్టీ అధినేత కేసీఆర్ ఇక్కడి నుంచే పోటీ చేసి ఎంపీగా గెలుపొందారు. మొక్కవోని ధైర్యంతో 2014లో స్వరాష్ట్రం సాధించి పెట్టారు. పాలమూరు ఎంపీగానే ఈ ఘనత సాధించడంతో ఈ పార్లమెంటు స్థానం చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. తెలంగాణ ఉద్యమ చరిత్రకు మహబూబ్‌నగర్ పార్లమెంట్ నాంది పలికింది. ఆ తర్వాత 2014లో కూడా బీఆర్ఎస్ పార్టీ విజయ ఢంకా మోగించింది. 2018లో అభ్యర్థిని మార్చినప్పటికీ పాలమూరు ప్రజలు గులాబీ జెండా వెంటనే నిలిచారు. ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొంది చరిత్ర సృష్టించారు. బీఆర్ఎస్‌కు మహబూబ్‌నగర్ హ్యాట్రిక్ విజయాన్ని అందించి కేసీఆర్ సారథ్యంలో ఓ చిరస్మరణీయమైన కానుకను అందించింది. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లోనూ మహబూబ్‌నగర్ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని గులాబీ బాస్ కేసీఆర్ ఆదేశించారు. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు పార్టీ సర్వశక్తులా ప్రయత్నాలు ప్రారంభించింది.



## మీకు గుర్తింపు తెచ్చిన పాట ఏది?

బలగం సినిమాలో పాడిన 'అయ్యో శివుడా! వెనుకట దానికి సరిపోయే..' అనే పాట గుర్తింపు తెచ్చింది. ఈ పాట కోసం పదకొండు రోజులు వివిధ రకాల పాటలను పాడి ఆఖరుకు ఈ పాటను ఎంపిక చేశారు. అనేక మంది కార్లలో ఎక్కించుకొని హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తీసుకెళ్లి పాటలు పాడించుకొని తిరిగి వదిలిపెట్టి వెళ్తుంటారు. ఇప్పటికీ విజయవాడకు చెందిన ఒక వ్యక్తి నెలకు రూ. 2 వేలు నా అకౌంట్‌లో వేస్తుంటాడు.

## గతంలో అవార్డులు వచ్చాయా?

నా కళను మెచ్చి తెలంగాణ ప్రభుత్వంలో గవర్నర్ నుంచి మెడల్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ కలెక్టర్ల నుంచి ప్రశంసాపత్రాలు, వివిధ వేదికల మీద నుంచి జ్ఞాపికలు కూడా అందుకున్నాను.



# బుర్రవీణకు పద్మాభిషేకం

ఇంటర్వ్యూ

- ప్రాచీన కళకు పద్మశ్రీ వరించడం సంతోషం
- పురస్కారంతో గ్రామీణ గానానికి అందలం
- జాతీయ స్థాయి గౌరవమంటే మాటలా..
- వినిపిస్తే తినిపిస్తది.. సంగీతం సరస్వతి వంటిది
- బలగం సినిమా పాటతో గుర్తింపు వచ్చింది
- మా మూడో తరం నుంచి వస్తున్న కళకు వారసుడిని..
- 'నమస్తే'తో పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన కొండప్ప

నారాయణపేట, జనవరి 29 : 'సంగీత కళ అనేది సరస్వతి లాంటిది.. ఇంట్లో దాస్తే ఎలాంటి ఉపయోగం ఉండదు.. అదే నలుగురికి వినిపిస్తే కడుపు నింపుతుంది' అని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ బుర్ర వీణ కళాకారుడు దాసరి కొండప్ప తెలిపారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన దాసరి కొండప్పతో సోమవారం 'నమస్తే తెలంగాణ' ముచ్చటించింది. గతంలో ఒక వెలుగు వెలిగిన అనేక ప్రాచీన కళలు నేడు ఆదరణ లేక అంతరించిపోతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం కళాకారులకు ఇస్తున్న గుర్తింపుతో తిరిగి జీవం పోసినట్లైందన్నారు. ప్రాచీన కళలకు పూర్వ వైభవం రావాలని ఆయన అభిప్రాయపడ్డారు.

**నమస్తే తెలంగాణ :** ఇతర వాయిద్య పరికరాలతో పోలిస్తే బుర్రవీణకు ఉన్న ప్రాముఖ్యత ఏమిటి?

**దాసరి కొండప్ప :** ఇతర వీణలను చేతితో వాయించి చిటికెలు వేస్తే బుర్ర వీణలను మాత్రం కర్రల సాయంతో వాయించాల్సి ఉంటుంది.

**బుర్ర వీణలను ఎక్కడి నుంచి తెస్తారు ?**

తాతల కాలం నుంచి బుర్ర వీణను మేమే స్వయంగా తయారు చేసుకుంటూ వస్తున్నాం. బూడిద గుమ్మడి నుంచి దీనిని తయారు చేస్తాం. దీనికి కర్రలను ఉపయోగించి ఇనుప తంతెలను అమరుస్తాం. ఇటీవల కాలంలో కాయలు దొరకడం లేదు. దీని వల్ల కొత్త బుర్రలను తయారు చేసుకోలేకపోతున్నాం. కుండ కంటే చాలా ఆగాదం ఉంటుంది.

**ఎన్ని ఏండ్లుగా ఈ కళను ప్రదర్శిస్తున్నారు?**

16వ ఏట నుంచి బుర్ర వీణ వాయిద్యాన్ని వాయిస్తున్నాను.

**మీరు ఎవరి నుంచి ఈ కళను నేర్చుకున్నారు?**

గురువులేని విద్య ఎందుకు అవలదు. నా తండ్రి వెంకన్న నుంచి బుర్ర వీణ వాయించడం నేర్చుకున్నాను. పాటలు పాడడం మాత్రం నా అన్న కొం డన్న నేర్పించారు.

**మీ కుటుంబంలో ఎప్పటి నుంచి ఈ కళ కొనసాగుతుంది.?**

మా తాత మొదటి తరం కాగా తండ్రి రెండో తరం.. నేను మూడో తరం ఈ బుర్ర వీణ కళకు వారసుడిని.

**బుర్ర వీణ కళ అంతరించిపోకుండా ఎవరికైనా ఈ విద్యను నేర్పిస్తున్నారా?**

నాతోనే ఈ బుర్రవీణ కళ అంతరించిపోరాదు. ఎవరైనా ముందుకు వస్తే ఈ కళను నేర్పించడానికి సిద్ధంగా ఉన్నాను. గతంలో మహబూబ్‌నగర్‌కు చెందిన ఒక అమ్మాయికి నేర్పించాను. ప్రస్తుతం నా మనువడు భానుప్రసాద్‌కు నేర్పిస్తున్నాను.

**బుర్రవీణ నేర్చుకోవడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటాయా?**



కొండప్పను వరించిన అవార్డులు

ఎలాంటి కష్టం ఉండదు. నేర్చుకోవడం చాలా సులభం. డక్కి, తాళం, డప్పు వంటి వాయిద్యాలను ఉపయోగించిన వారికి బుర్రవీణ నేర్చుకోవడం మరింత సులభంగా ఉంటుంది.

**బుర్రవీణ కళపై మీ కుటుంబీకులు ఎందుకు ఆసక్తి కనబర్చలేదు?**

మాది వన్నె దాసరి కులం. ఇంటింటికీ తిరిగి బుర్రవీణతో పాటలు వినిపించి అక్షయపాత్రతో బిక్షం అడుక్కునే బిచ్చయాత్ర ఉండేది. ఇలా దాతలు ఇచ్చే ధాన్యంతో జీవనం గడుపుతూ వచ్చేవాళ్లం. రానురాను కాళ్లు చేతులు బాగానే ఉన్నాయి కదా.. పని చేసి బతుకొచ్చుకదా అని జనం అనే మాటలు మనసుకు తగిలి అప్పటి నుంచి బిచ్చయాత్ర మానేసి, స్టేజీ ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాను. కానీ బంధువుల్లో అందరూ చదువుకొని ఉద్యోగాలు చేస్తుంటే తాము బుర్ర వీణ వాయించాలా అని మా పిల్లలు ఎవరూ ఈ విద్యను నేర్చుకోలేదు.

**ఇప్పటివరకు ఎక్కడెక్కడ ప్రదర్శనలు ఇచ్చారు?**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, కడప, కర్నూల్, హైదరాబాద్, మహబూబ్‌నగర్ వంటి ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చాను.

**ఎలాంటి పాటలు పాడతారు?**

మహాభారతం, రామాయణం, హరిశ్చంద్ర నాటకాలు, చెంచుకొమ్మలు, ధర్మాంగ చరిత్ర, జ్ఞాన తత్వాలు వంటి వాటిని బుర్రవీణ వాయిస్తూ పాడుతాను.

**బుర్ర వీణ కళతో జీవనం ఎలా ఉంది?**

ఎనుకటి రోజుల్లో ఈ కళ ప్రదర్శన ద్వారా జీవనం కొనసాగేది. కానీ వయస్సు పైబడడం వల్ల ఎక్కువగా తిరగలేకపోతున్నాను. ఇంట్లో పిల్లలు చేసే చిన్నచిన్న వ్యాపారాలతో ప్రస్తుతం జీవనం కొనసాగుతున్నది.

**దేశంలోనే అత్యుత్తమైన పద్మశ్రీ అవార్డు అందుకుంటున్నందుకు ఎలా ఉంది?**

ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న నన్ను అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో గర్వంగా ఉంది. ఇలాంటి అవార్డుతో అంతరించిపోతున్న ప్రాచీన కళలకు పూర్వ వైభవం వచ్చినట్లైంది.



మీటింగ్‌హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

## గ్రామాలాభివృద్ధికే 'రూర్బన్ మిషన్'

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి, జనవరి 29 : గ్రామాల అభివృద్ధి కోసమే రూర్బన్ మిషన్ పథకం ఏర్పాటు చేసి రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మండలంలోని పెద్దకారుపాములలో రూర్బన్ మిషన్ పథకం ద్వారా పూర్తయిన భవనాలను సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల భరోసా కల్పిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ గౌరమ్మ, సర్పంచులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాధ, సత్యం, రమేశ్‌రావు, నర్సింహ, చంద్రయ్య పాల్గొన్నారు.

### ఆరు గ్యారెంటీలు తప్పకుండా అమలుచేస్తాం..

పాన్‌గల్, జనవరి 29 : గ్రామాల సంపూర్ణాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించతలపెట్టిన నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలు తప్పకుండా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, పంచాయతీరాజ్ డీఈ చెన్నయ్య మాజీ జెడ్పీటీసీ రవి, సర్పంచ్ సింధుజా, నాయకులు జయరాములు, ఉస్మాన్, మధుసూదన్ రెడ్డి, గోవర్ధన్‌సాగర్, పుల్లారావు, భాస్కర్ యాదవ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, హాజరైన సర్పంచులు, కార్యకర్తలు

- పార్టీ గెలుపునకు కృషి చేయాలి
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- కేసీఆర్ పాలనలోని అభివృద్ధి చిరస్థాయిగా నిలిచిపోతుంది : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గద్వాల రూరల్, జనవరి 29 : బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం, బలగం అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రవేశపెట్టిన పథకాలతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాయలంలో సోమవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం, బీఆర్ఎస్ సర్పంచుల సన్మాన కార్యక్రమం నిర్వహించగా.. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు మధ్యవర్తి లేకుండా అందడంతో ప్రజలతో సమన్వయం కొరవడి ఇబ్బంది కలిగిందన్నారు. అలాంటివి భవిష్యత్‌లో జరుగకుండా దృష్టి సారిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిందని.. వాటిని అమలు చేయకుంటే ప్రజలపక్షాన పోరాటం చేయడానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామంలో సర్పంచుగా మీరు చేసిన అభివృద్ధి పనులు గుర్తుండిపోతాయన్నారు. అనంతరం సర్పంచులను శాలువా, మెమెంటోతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సరోజమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీలు ప్రతాప్‌గౌడ్, విజయకుమార్, రాజారెడ్డి, మనోరమ, జెడ్పీటీసీలు పద్మ, రాజశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, శ్యామల, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, వైస్ చైర్మన్ బాబర్, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు రమేశ్‌నాయుడు, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామన్‌గౌడ్, సలాం, మధుసూదన్‌రెడ్డి, తిమ్మారెడ్డి ఉన్నారు.

## ఎల్లూరు పల్లె దవాఖానలో ఢిల్లీ బృందం తనిఖీ

కొల్లాపూర్, జనవరి 29 : మండలంలోని ఎల్లూరు పల్లె దవాఖానలో వైద్య సేవలు, వసతులు, నాణ్యతా ప్రమాణాలను ఢిల్లీకి చెందిన ఎన్‌క్యూఏఎస్ అస్సెస్‌మెంట్ టీం ప్రతినిధులు డాక్టర్ ప్రశాంత్ పున్‌డ్లిక్ గోడం, డాక్టర్ వెన్నెల ఎస్తేర్ ఫెర్నాండేజ్ గోమ్స్ తనిఖీ చేశారు. జిల్లా క్వాలిటీ ఆఫీసర్ సంతోష్, పెంట్లవెల్లి పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి సోమవారం దవాఖానలోని గదులు, పరిసరాలు, వాటర్ ట్యాంక్, ఓపీ నమోదు కేంద్రం, మరుగుదొడ్డి, సీహెచ్‌వో, ల్యాబ్ ఏరియా, యోగా ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం దవాఖాన పనితీరును ఏఎన్ఎంలు, ఎంపీహెచ్‌లు, ఆశకార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంపూర్ణమ్మ, ఎంపీహెచ్ఈవో రమేశ్, సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, దివాకర్, ఏఎన్ఎం భాగ్యమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న ఉన్నారు.



దవాఖానను పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

## క్రీడలతో మానసికోల్లాసం

- నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్
- జిల్లా పోలీస్ స్పోర్ట్స్ వార్షిక పోటీలు ప్రారంభం

నాగర్‌కర్నూల్, జనవరి 29 : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. జెడ్పీ క్రీడా మైదానంలో నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను సోమవారం ఎస్పీ ప్రారంభించారు. అంతకుముందు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీస్ జట్లతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం ఎస్పీ గైక్వాడ్, అదనపు ఎస్పీ, అదనపు ఎస్పీ రామేశ్వర్ శాంతికపోతాలను ఎగురవేసి, జెండాలను ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. ఈనెల 31వరకు కొనసాగనున్న క్రీడల్లో ఆరు జట్లు పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో ఏటా క్రీడలు నిర్వహిస్తామన్నారు. డిపార్ట్‌మెంట్‌లో పోటీలు నిర్వహించడం ముఖ్యమైందన్నారు. సమయం ఉన్నప్పుడల్లా ప్రతి పోలీస్ అధికారి ఏదో ఒక క్రీడలో రాణించాలన్నారు. కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలకు చెందిన పోలీసులు పాల్గొంటున్నారన్నారు. టీమ్‌తోపాటు సింగిల్‌గా ఆడే క్రీడలు ఉన్నాయని, పోలీసులు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీలు సత్యనారాయణ, మోహన్‌కుమార్, పార్థసారథి, చారి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ గైక్వాడ్

## భార్యపై అనుమానంతో భర్త ఆత్మహత్య

ఊర్కొండ, జనవరి 29 : భార్యపై అనుమానంతో పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాచాలపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. ఏఎస్సై కథనం మేరకు.. రాచాలపల్లికి చెందిన గౌరారం ఆనంద్ (34) ఐసీఐసీఐ బ్యాంకులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కాగా, సూర్యాపేట జిల్లాకు చెందిన సుస్మితను కొన్నేండ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. అయితే, కొద్దిరోజులుగా సుస్మిత తన సొంత గ్రామానికి చెందిన వ్యక్తితో తరుచుగా ఫోన్‌లో మాట్లాడుతుండడంతో ఆమెను నిలదీశాడు. దీంతో సుస్మిత శనివారం పుట్టింటికి వెళ్లింది. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి వద్దకే తన భార్య వెళ్లిందన్న అనుమానంతో శనివారం రాత్రి గులికల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి అన్న గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపాడు.